
సాక్షి
బాపట్ల
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 579.80 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,096 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా కల్యాణం

నగరంపాలెం: గుంటూరు బ్రాడీపేటలోని శ్రీ గౌరీ విశ్వేశ్వరాలయంలో స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా సోమవారం కల్యాణం నిర్వహించారు. భక్తులు తిలకించారు.

ఆరుద్రాభిషేకాలు



రేపల్లె రూరల్: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆరుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అక్రమాల్లో 'ట్రాక్' రికార్డు

- గుంటూరు నగర పాలక సంస్థలో టౌన్‌ప్లానింగ్ తీరు ఇది
- ఎన్‌ఓసీలు పేరిట బిల్డర్లను బెదిరిస్తున్న ఆ విభాగం అధికారులు
- రైల్వే లైన్ వెంట 70కి పైగా వివిధ ఫ్లోర్ల భవనాలు
- నిరభ్యంతర పత్రాలు ఉన్నవి అయిదారే అంటున్న రైల్వే శాఖ
- కొంత మంది బిల్డర్లే లక్ష్యంగా కార్పొరేషన్ నోటీసులు
- వివాదాస్పదం అవుతున్న టౌన్ ప్లానింగ్ చర్యలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ లీలలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తమకు నచ్చని బిల్డర్లను ఎన్‌ఓసీ (నో అబ్జక్షన్ సర్టిఫికెట్)ల పేరుతో వేధించడం తాజాగా చర్చనీయాంశంగా మారింది. బిల్డర్లు వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు నిర్మించేటప్పుడు అగ్నిమాపక, పర్యావరణ శాఖల నుంచి నిరభ్యంతర పత్రాలు(ఎన్‌ఓసీ) తీసుకుని టౌన్ ప్లానింగ్‌కు సమర్పించాలి. వీటితోపాటు యాజమాన్య హక్కు పత్రం, లింక్ పత్రాలు, ఎన్‌కంబెన్సీ సర్టిఫికెట్ (ఈసీ), స్ట్రక్చరల్ స్థిరత్వం నివేదిక, సర్టిఫైడ్ స్ట్రక్చరల్ డ్రాయింగ్, బీమా పాలసీ డాక్యుమెంట్లు అందజేయాలి. ఇక రైల్వే లైన్ పక్కన వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు నిర్మిస్తుంటే ఆ శాఖ నుంచి కూడా ఎన్‌ఓసీ తెచ్చుకోవాలి. భవనం పూర్తయ్యి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ (ఓసీ) కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో పైన పేర్కొన్న ఆయా విభాగాల నుంచి నిరభ్యంతర (ఎన్‌ఓసీ) పత్రాలు అందజేయాలి. అయితే, టౌన్ ప్లానింగ్ అధికారులు దీనికి భిన్నంగా ఎన్‌ఓసీలు ముందుగానే అందజేయాలని ఒత్తిడి చేయడంతో పాటు తమకు అనుకూలంగా లేని బిల్డర్లను వేధించడం ప్రారంభించారు.



గుంటూరు నగరంలో రైల్వే లైన్ పక్కన నిర్మించిన భవనాలు

రైల్వేలైన్ పక్కన నిర్మించాలంటే...

నగరపాలక సంస్థ పరిధిలో రైల్వే లైన్ పక్కన భవన నిర్మాణాలు జరిపే విషయంలో కూడా కొన్ని నిబంధనలు పాటించాలి. రైల్వే లైన్ పక్కన వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు నిర్మించాలంటే ఆ శాఖ నుంచి కూడా ఎన్‌ఓసీ తీసుకోవాల్సి ఉంటుంది. అయితే, రైల్వే ఎన్‌ఓసీ గురించి పలువురు బిల్డర్లు పట్టించుకోవడం లేదు. దీనికి కొన్ని భవనాలను పరిశీలిస్తే ..... నెహ్రూనగర్ నుంచి నగర శివారు వరకు రైల్వే లైన్ పక్కన సుమారు 75 నుంచి 80 వరకు వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు ఉన్నాయి. ఇవన్నీ ఆక్యుపెన్సీ సమయంలో రైల్వే శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకుని టౌన్ ప్లానింగ్‌కు సమర్పించాలి. ఆ తర్వాతనే బిల్డర్లకు టౌన్ ప్లానింగ్ అధికారులు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలి. అయితే, మామూళ్ల మత్తులో మునిగి తేలే టౌన్ ప్లానింగ్‌కు ఇవేమీ పట్టడం లేదు.



రైల్వే ట్రాక్ పక్కన వెలసిన భారీ భవనాలు

బెదిరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

ఇక గుంటూరు నగరంలో రైల్వే శాఖ నుంచి ఎన్‌ఓసీ తీసుకున్న భవనాలు, అపార్టుమెంట్లు ఐదారు మించి ఉండవని రైల్వే అధికారులే చెబుతుండడం ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశం. అంతే కాదు బిల్డర్లు తమ వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకుంటేనే ఎన్‌ఓసీ గురించి తాము పరిశీలిస్తామని కూడా వారే చెబుతున్నారు. రైల్వే అధికారుల మాటలను పరిగణలోకి తీసుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ మామూళ్ల దందా చేస్తున్నారు. మరో వైపు తమకు నచ్చని బిల్డర్లను మాత్రం రైల్వే ఎన్‌ఓసీ ఉంటేనే వివిధ ఫ్లోర్లు కలిగిన భవనాలు, అపార్టుమెంట్లు కట్టనిస్తామని, లేకపోతే ప్లాన్ రద్దు చేస్తామంటూ బెదిరింపులకు దిగడం నగరంలో చర్చనీయాంశమైంది.

అనుమానాలకు అవకాశం

నగరంలో ఇప్పటికే 1187 భవనాలు షార్ట్ ఫాల్‌లో ఉన్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ నిర్ధారించారు. ఈ భవనాలకు పైన పేర్కొన్న ఎన్‌ఓసీలు లేనప్పటికీ కొద్దిమంది బిల్డర్లకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు ఇచ్చేశారు. మరికొందరిని ఎన్‌ఓసీల కోసం టౌన్‌ప్లానింగ్ అధికారులు ఒత్తిడి చేయడం వెనుక అధికార పార్టీ నేతల ప్రమేయం ఉన్నట్లు అవగతమవుతోంది. షార్ట్‌ఫాల్స్‌కు సంబంధించి అధికార పార్టీ నాయకులు, పలుకుబడి ఉన్న వారి భవనాల వైపు తొంగి చూడకపోవడం ఇందుకు బలం చేకూరుస్తోంది. అదే అధికార పార్టీకి నచ్చని బిల్డర్ల భవనాలను అక్రమాలుగా నిర్ణయి స్తున్నారు. అధికార పార్టీకి చెందిన బిల్డర్ల అక్రమాలు కళ్ల ముందు కనిపిస్తున్నా చర్యలు శూన్యం. ఈ తరహా అక్రమాలతో టౌన్‌ప్లానింగ్ విభాగం పెద్ద ఎత్తున 'మూటలు' కట్టుకుంటున్నా.. మున్సిపల్ కమిషనర్ సమీక్ష చేయకపోవడం విడ్డూరం

న్యూస్‌రీల్

ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

సిబ్బందిని ఆదేశించిన ఎస్పీ తుషార్‌డూడీ



బాపట్లటౌన్: బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ తుషార్‌డూడీ సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 37 మంది వచ్చారు. వీరు ఎస్పీని కలిసి సమస్యలు విన్నవించుకున్నారు. బాధితుల సమస్యలు తెలుసుకున్న ఎస్పీ జిల్లాలోని పోలీస్ అధికారులతో మాట్లాడి బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, భూ వివాదాలు, ఆర్థిక లావాదేవీ మోసాలు, ఇతర పలు సమస్యలతో కూడిన అర్జీలు అధికంగా ఉన్నాయన్నారు. బాధితుల సమస్యలపై త్వరితగతిన విచారణ జరిపి న్యాయబద్ధంగా బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పీజీఆర్ఎస్ ఇన్‌ఛార్జి సీఐ శ్రీనివాసరావు అధికారులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి పశువుల కాపరి మృతి



చనిపోయిన పిచ్చయ్య

బల్లికురవ: పశువులు కాసేందుకు పొలానికి వెళ్లిన పశువుల కాపరి ప్రమాదవశాత్తూ కాలుజారి నీటి కుంటలో పడి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం మండలంలోని వల్లాపల్లి గ్రామ సమీపంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం పాస్టర్ రోశయ్య పెద్ద కుమారుడు పిచ్చయ్య (30) మానసిక దివ్యాంగుడు. పశువులను తోలుకుని బల్లికురవ వెళ్లే రోడ్డులో మేపుతుండగా రోడ్డు పక్కనే ఉన్న చాకలికుంటలో నీరు తాగేందుకు పశువులు దిగాయి. వాటిని తోలేందుకు నీటికుంట వద్దకు వెళ్లగా కాలు జారి కుంటలో పడిపోయాడు. ఈత రాకపోవటంతో చనిపోయాడు. పొలాల నుంచి వస్తున్న రైతులు కుంట నుంచి పిచ్చయ్యను బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు.

నేడు, రేపు పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడా పోటీలు

గుంటూరురూరల్: మండలంలోని నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులపాటు ఐపీఎస్‌జీఎం-2024 పేరిట నిర్వహించనున్న క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన 513 మంది పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, డీఈఓ సి.వి.రేణుక, పీవీఆర్ చలపతి మెటల్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ పిల్లా వెంకటేశ్వరరావు, క్రీడల అభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి పాల్గొంటారని,ఎస్‌వీయూ రీజనల్ జేడీ నిర్మల్‌కుమార్ ప్రియ పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

ఎయిమ్స్ స్నాతకోత్సవ ఏర్పాట్ల పరిశీలన



మంగళగిరి: పట్టణంలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)లో మంగళవారం జరగనున్న ప్రథమ స్నాతకోత్సవ ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని కలెక్టర్ జి.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం ఆమె ఏర్పాట్లను ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మాదభనందకర్, జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా, అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులతో పాటు పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటున్న నేపథ్యంలో భద్రత, పార్కింగ్ ఏర్పాట్లను అధికారులు సమన్వయంతో చేయాలని సూచించారు.

శ్రీరామ కోటి ఉత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్‌లోని శ్రీరామ నామ క్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం అంకురారోపణ పూజ, అఖండ జ్యోతి స్థాపన చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ ధనకుదరం సీతారామానుజాచార్యులు శ్రీరామ పతాకావిష్కరణ చేసి ఉత్సవాలను ప్రారంభించారు. శ్రీసీతారామ పరివార సేవ అత్యంత విశేషమని భక్తులకు తెలియజేశారు. ఏర్పాట్లను శ్రీ శృంగేరి పీఠపాలిత శ్రీ సీతారామ సంకీర్తన సంఘం, శ్రీరామ నామ క్షేత్రం కార్య నిర్వాహకులు రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, క్షేత్ర పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి అవసరం

ఏపీఎస్ఐఆర్‌డీ జేడీ కేశవరెడ్డి

చీరాలటౌన్: దేశం అభివృద్ధి చెందుతున్న జాబితా నుంచి అభివృద్ధి చెందిన దేశంగా రూపాంతరం చెందాలంటే గ్రామాలన్నీ సుస్థిరాభివృద్ధి చెందాలని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సహకారంతో అధికారులు గ్రామాలను మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఏపీఎస్ఐఆర్‌డీ జాయింట్ డైరెక్టర్ కె.కేశవరెడ్డి సూచించారు. సోమవారరం చీరాల మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్నీ సచివాలయాల్లోని అన్నీ విభాగాల ఉద్యోగులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, వెలుగు, ఉద్యానశాఖ, తదితరశాఖల ఉద్యోగులకు సుస్థిరాభివృద్ధిపై శిక్షణ సదస్సు ప్రారంభించారు. ఎంపీడీవో శివసుబ్రమణ్యం అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలకు ఏపీఎస్ఐఆర్‌డీ జేడీ హాజరయ్యారు. ఈనెల 19 వరకు జరగనున్న శిక్షణా తరగతుల్లో ప్రభుత్వ ఉద్యోగులు చేపట్టాల్సిన పనులు, అభివృద్ధికి అకుంఠిత దీక్షతో ఏ విధంగా విధులు చేయాలని వివరించారు. జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యవంతులుగా చేయాలన్నారు. ప్రతి ఒక్కరు విధిగా చదువుకోవాలని, డ్రాప్ అవుట్స్‌ను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌళిక వసతులైన రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు, ప్రభుత్వ పరంగా అందాల్సిన పక్కా ఇళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు అందరు ఉన్నతస్థాయికి చేరడంతోపాటుగా అద్భుతమైన గ్రామాలుగా తీర్చిదిద్దే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందన్నారు. డీఎల్‌పీవో పద్మావతి, చీరాల తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ పలు అంశాలు, నిబంధనల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో ఈవోఆర్డీ రామకృష్ణ, ఏపీఎం మధుసూదనరావు, ఐసీడీఎస్ సిబ్బంది, వీఆర్వోలు, పంచాయతీల సెక్రటరీలు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్‌డీ జేడీ కేశవరెడ్డి

అర్జీలను వెంటనే పరిష్కరించండి



జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు అర్జీలు ఇస్తున్న బాధితులు

- జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 98 అర్జీలు స్వీకరణ

బాపట్ల: ప్రజా సమస్యలపై వస్తున్న అర్జీలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి 98 దరఖాస్తులు నమోదయ్యాయి. అనంతరం తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలు, రెవెన్యూ, రీ సర్వే దరఖాస్తుల గురించి ఆరా తీశారు. పీజీఆర్ఎస్‌పై వచ్చిన ఫిర్యాదులకు సరైన కారణాలు చూపకుండా అసంపూర్తిగా తిరస్కరించడం సరికాదన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించాలని, పెండింగ్ ఉన్న అర్జీలను కేటగిరీల వారీగా విభజించి నివేదించాలని ఆదేశించారు. సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించిన తీరుపై ఆయన ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గడువు దాటే వరకు అర్జీలు పెండింగ్‌లో ఉండరాదన్నారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను నాణ్యతతో పరిష్కరించడానికి సంబంధిత జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రైసైకిళ్లు పంపిణీ చేయాలి

దివ్యాంగులు మూడు చక్రాల ట్రై సైకిళ్లు, చంక కర్రలు, చెవిటి మిషిన్లు, బ్లైండ్ స్టిక్‌లు వీల్ చైర్లు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య కోరారు. ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జేసీకి వినతి పత్రం అందించారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ నిధుల నుంచి పరికరాలు కొనుగోలు చేసి పంపిణీ చేసేందుకు అవకాశం ఉందని, వెంటనే దివ్యాంగులకు పరికరాలు ఇప్పించే విధంగా చూడాలని కోరారు. తనను కలిసిన ఈపూరి బోడిమ్మ, ఆరాధ్యుల వెంకటేశ్వరమ్మ, డి.కృష్ణారెడ్డికి వెంటనే ట్రై సైకిళ్లు అందజేయాలని దివ్యాంగుల శాఖ అధికారులను జేసీ ఆదేశించారు.

ప్రభుత్వ భూములకు బోర్డులు ఏర్పాటు చేయాలి

బాపట్ల రెవెన్యూ శాఖ పరిధిలో 200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ప్రకటించిన అధికారులు వాటిలో బోర్డులు ఏర్పాటు చేయాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య జేసీకి వినతి పత్రం అందించారు. ప్రభుత్వ భూములను గుర్తించిన అధికారులు వాటిని కాపాడుకునేందుకు వెంటనే బోర్డులు ఏర్పాటుచేసేవిధంగా ఆర్డీఓకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన జేసీ రెవెన్యూ అధికారులకు ఆదేశాలు ఇస్తామని చెప్పారు.


కూటమిలో 'చాంబర్' వార్

- పోటీలో ఇద్దరు పచ్చ నేతలు
- ఏకగ్రీవం కోసం కూటమి నేతల తంటాలు
- రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- 28న ఎన్నికలు

నగరంపాలెం: ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ఎన్నికలు ఈసారి రసకందాయంలో పడ్డాయి. ఏకగ్రీవం కోసం కూటమి నేతల తంటాలు పడుతున్నా, అధ్యక్ష స్థానం కోసం ఇద్దరు టీడీపీ నేతలు పావులు కదుపుతున్నారు. ఎన్నికల ముందు, తర్వాత టీడీపీలో చేరిన యేల్చూరి వెంకటేశ్వర్లు, రంగా బాలకృష్ణ అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్నారు. ఇటీవల కొత్తపేటలోని ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలోనూ అధ్యక్ష పదవికి అవకాశం ఇవ్వాలని వ్యాపార వర్గాలను, కూటమి నాయకులను బాలకృష్ణ అభ్యర్థించారు. మరోవైపు యేల్చూరిని ఏకగ్రీవంగా చేసేందుకు నేతలు మంతనాలు చేస్తున్నారు. ఒకవేళ ఏకగ్రీవానికి ఆమోదం లభించకపోతే, అధిక ఓట్ల మెజార్టీతో ఆయన్ను గెలిపించేందుకు పావులు కదుపుతున్నారు. అయితే, బరిలో ఉన్న అభ్యర్థులు గెలుపు కోసం నానా తంటాలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఓటర్ల జాబితాలోని వారితో సెల్ ఫోన్లల్లో మాట్లాడుతున్నారు. దగ్గరలో ఉన్న వారి వద్దకు నేరుగా వెళ్లి సంప్రదింపులు చేస్తున్నారు. ఎవరికి వారు ఈసారి ఎన్నికల్లో తమ అభ్యర్థిత్వానికి మద్దతుగా ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చాంబర్‌కు సుదీర్ఘ చరిత్ర

గుంటూరు జిన్నాటవర్ సెంటర్‌లోని ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్ (ఐసీసీ) ప్రధాన కార్యాలయం 1941లో ఏర్పాటైంది. ఏర్పాటైన తొలినాళ్లలో సుమారు 900 మంది వ్యాపారులకు సభ్యత్వం ఉండేది. కాలక్రమేణా ఆ సంఖ్య సుమారు 3,200 చేరింది. వ్యాపారాలు చేసే అన్నివర్గాలు చాంబర్‌లో ఉన్నారు. రూ.3 వేల (జీవితకాలం) సభ్యత్వం, రూ.8 వేల మహారాజ పోషక (జీవిత కాలం) సభ్యత్వాలు ఉన్నాయి. వ్యాపారులకు మేలు చేయాలనే లక్ష్యంతో చాంబర్‌ను నెలకొల్పారు. అందుకు అనుగుణంగానే కార్యవర్గాన్ని కూడా ఎన్నుకునేవారు. గతంలో పన్నెండున్నరేళ్లు దివంగత ఎంపీ మద్ది సుదర్శన్ అధ్యక్షునిగా పనిచేశారు. ఆ తర్వాత 34 ఏళ్ల పాటు చాంబర్ అధ్యక్షునిగా ఆతుకూరి ఆంజనేయులు పదవీ బాధ్యతలు నిర్వహించారు. చాలా సార్లు ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత రికార్డులను చెరిపేశారు. వ్యాపార వర్గాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపారు. విపత్కర పరిస్థితులు తలెత్తినప్పుడు చాంబర్ నుంచి భారీగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అయితే, ఈనెల 28న జరగనున్న ఎన్నికలకు ఆయన దూరంగా ఉంటున్నారు. కొత్త వారికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో పోటీ నుంచి వైదొలగినట్లు ఆంజనేయులు తెలిపారు. ఈ క్రమంలో ఆయనకు గౌరవ అధ్యక్ష పదవి కేటాయించనున్నారు.



ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ లోగో

కార్యాలయం ఆధునికీకరణ

చాంబర్ భవనంలో ప్రస్తుతం కొనసాగుతున్న కార్యాలయాన్ని పైకి తరలించారు. ఈనెల 15న ప్రస్తుత అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు దీన్ని ప్రారంభించారు. గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షులకు ప్రత్యేక చాంబర్‌లతో పాటు సమావేశాలకు అనువుగా ఉండేలా తీర్చిదిద్దారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు

ఎన్నికల నామినేషన్ల పక్రియ ఈనెల 18 నుంచి మొదలవుతుంది. 25న ఎవరెవరూ బరిలో ఉన్నారనే దానిపై ఒక స్పష్టత వస్తోంది. 28న జిన్నా టవర్ కూడలిలోని చాంబర్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 8.30 గంటలకు ఓట్ల నమోదు పక్రియ మొదలై, సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. సాయంత్రం నుంచి ఓట్లను లెక్కించి నూతన అధ్యక్షుడ్ని ప్రకటించనున్నారు.

కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్చు చేయాలి



జాయింట్ కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

గిరిజన సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ టీచర్స్‌ను కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్పు చేయాలని ప్రజా సమస్యల పరిష్కారవేదికల్లో జేసీకి వినతిపత్రం అందించారు. రెసిడెన్షియల్ టీచర్స్‌గా మార్పు చేయటంతోపాటు 2022 పీఆర్సీ ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఔట్ సోర్సింగ్ విధానంలో 10 నుంచి 15 ఏళ్లగా 1656 మంది అతి తక్కువ వేతనాలకు పనిచేస్తున్నామని వివరించారు. బాపట్ల జిల్లాలో 45 మంది టీచర్స్ పనిచేస్తుండగా బాపట్ల, రేపల్లె, స్టువర్టుపురం, పర్చూరు, అద్దంకిలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి అతి తక్కువ వేతనాలు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జేసీని కలిసిన వారిలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.మజుందార్, నాయకులు కె.శరత్, ఔట్ సోర్సింగ్ ఉద్యమ నాయకులు ఎం.పరమేష్, రామకృష్ణ, రవికిరణ్, సుజాత, శాంతి ప్రియ, కోటేశ్వరి పాల్గొన్నారు.

జీతం సర్కారుది.. సేవలు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు

- సొంత ఇంటి నిర్మాణ పనులకు వాడుకుంటున్న వైనం
- 20 మంది పారిశుద్ధ్య కార్మికులు తరలింపు

చీరాలటౌన్: ప్రతిరోజూ మున్సిపాలిటీలోని రోడ్లు, డ్రెయిన్‌లు శుభ్రంచేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం పారిశుద్ధ్య కార్మికుల విధి. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసే వీరికి జీతం ఇచ్చేది ప్రభుత్వం. కానీ ఓ అధికారి మాత్రం తన సొంత పనులకు వాడుకుంటూ విధులను, నిధులను దుర్వినియోగం చేస్తున్నాడు. అధికార పార్టీ అండదండలతో ఇలా ప్రవర్తిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. చీరాల మున్సిపాలిటీలో పనిచేసే శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన సొంత పాత ఇంటిని కూల్చేందుకు పారిశుద్ధ్య కార్మికులను వినియోగించడం చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు రేపల్లెలో తన సొంత ఇంటిని కూల్చేందుకు 20 మందిపారిశుద్ధ్య కార్మికులను తీసుకెళ్లాడు. ప్రభుత్వ సొమ్ముతో డీజిల్ కొట్టించుకుని పారిశుద్ధ్య పనులకు వినియోగించే ఆటోను తన సొంత పనులకు వినియోగిస్తున్నాడు. కార్మికులను ప్రభుత్వ ఆటోలో రేపల్లెకు తరలించి తన సొంత ఇంటిని కూల్చేందుకు వినియోగించడం తన అధికార దర్పాన్ని ప్రదర్శించాడు.



రేపల్లెలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత ఇంటి కూల్చివేత పనుల్లో పారిశుద్ధ్య కార్మికులు

క్లుప్తంగా

ధనుర్మాస వేడుకలు ప్రారంభం



రేపల్లె రూరల్: సూర్యభగవానుడు ధనురాశిలో ప్రవేశించిన సందర్భంగా నిర్వహించుకునే ధనుర్మాస వేడుకలను సోమవారం పట్టణంలో పలు దేవాలయాలలో ప్రారంభించారు. విష్ణుమూర్తికి ప్రీతిపాత్రమైన ధనుర్మాసం నెల రోజులపాటు పూజలు నిర్వహిస్తూ భగవంతుని కృపకు పాత్రులు కావాలని ఆలయాల అర్చకులు ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేక మహోత్సవం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. రైలుపేట, రామకోటిపేటలలోని రామాలయాలలో, ఓల్డ్‌టౌన్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

- కంప్యూటర్లు దగ్ధం
- రూ.లక్ష వరకు నష్టం



బల్లికురవ: మండలంలోని వల్లాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గదిలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పాఠశాల గ్రాంటుతో కొనుగోలు చేసిన కంప్యూటర్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఉపాధ్యాయులు మంటలు పక్కగదులకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష పైగా ఆస్తి నష్టం సంభవించిందని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తెలిపారు.

ఆలయ దుకాణాల వేలంలో రూ.12,84 లక్షలు



వేటపాలెం: రావూరిపేట శివారులో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వివిధ దుకాణాల నిర్వహణ హక్కుల కోసం నిర్వహించిన వేలంలో రూ.12.84 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పోతిన శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గతేదాది రూ.7.52 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది నిర్వహించిన వేలంలో రూ.5.32 లక్షలు ఆదాయం అదనంగా చేకూరిందని తెలిపారు. కొబ్బరికాయలు, పూల అమ్మకానికి రూ. 1.89 లక్షలు, శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్ విక్రయాల కోసం రూ.2.23 లక్షలు, షామియానా షాపు కోసం రూ.5.10 లక్షలు, చీరలు పోగుచేసుకొనుటకు, కోసం రూ.1.50 లక్షలు, తలనీలాలు పోగు చేసుకోవడం కోసం రూ.65 వేలు, కిళ్లీలు అమ్మకం కోసం రూ.8 వేలు, పాటిళ్ల కోసం రూ. 1.69 లక్షలు కాంట్రాక్టర్లు వేలం ద్వారా సంవత్సరంపాటు విక్రయాల కోసం దక్కించుకున్నారని ఈవో తెలిపారు.

రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ పోటీల విజేత గుంటూరు



బహుమతి అందుకుంటున్న గుంటూరు జిల్లా బాలుర జట్టు



బహుమతి అందుకుంటున్న గుంటూరు జిల్లా బాలికల జట్టు

- బాలురు, బాలికల విభాగంలో సత్తా చాటిన క్రీడాకారులు
- రన్నర్లుగా నిలిచిన పశ్చిమగోదావరి, శ్రీకాకుళం
- బాల, బాలికల విభాగంలో తృతీయ స్థానంతో సరిపెట్టిన విజయనగరం

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–19 బాల, బాలికల బేస్‌బాల్ క్రీడా పోటీల్లో గుంటూరు బాలురు, బాలికల జట్లు తమ ప్రతిభను చాటి విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్ –19 బేస్ బాల్ పోటీలు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్లలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. సోమవారం ఫైనల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్ –19 బాలుర విభాగంలో ఫైనల్స్‌లో పశ్చిమగోదావరి జిల్లా జట్టుపై గుంటూరు జిల్లా జట్టు క్రీడాకారులు పైచేయి సాధించి విజేతగా నిలిచింది. విజయనగరం జట్టు తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది. బాలికల విభాగంలోనూ శ్రీకాకుళం జిల్లా జట్టుపై గుంటూరు బాలికల జట్టు విజేతగా నిలిచింది. విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానం సరిపెట్టుకుంది.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. బేస్‌బాల్ పోటీల విజేతలకు సోమవారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను రెండు శాతం నుంచి మూడు శాతానికి పెంచడం క్రీడాభివృద్ధికి దోహదం చేస్తోందన్నారు. క్రీడాకారులకు రాత పరీక్షల్లోనూ రిజర్వేషన్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో లయోలా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఈ వంశీకృష్ణారెడ్డి, అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి నరసింహారావు, సహాయ కార్యదర్శి సీహెచ్ పద్మాకర్, దాసరి కోటేశ్వరరావు, కడియం జయరావు, సి నాగేంద్ర, యు.నీలిమ, లాకు పిచ్చయ్య, ఫిజికల్ డైరెక్టర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ అథ్లెటిక్స్ ఓవరాల్ రన్నర్స్ కృష్ణవేణి కళాశాల



వర్సిటీ ఓవరాల్ రన్నర్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని, పీడీ ఆదిబాబు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఓవరాల్ చాంపియన్స్ రన్నర్స్‌గా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు సోమవారం తెలిపారు. వర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌పై ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన పురుషులు, మహిళల అథ్లెటిక్స్ పోటీలలో తమ విద్యార్థులు నాలుగు బంగారు, ఐదు సిల్వర్, 14 కాంస్య పతకాలతో ఆల్‌రౌండ్ రన్నర్స్‌గా నిలిచారని వివరించారు. తమ విద్యార్థులు కె.విశాలాక్షి ఆఫ్ మారథాన్‌లో బంగారు, మిక్స్‌డ్ రిలేలో వెండి, 10 కిమీ రిలేలో వెండి పతకాలు, ఎం.శిరీషా హెప్టాతిలిన్‌లో బంగారు, 800మీ పరుగులో బంగారు, 4 100 రిలేలో కాంస్యం, ఎం.చౌడేశ్వరీ 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు, 4 100 రిలేలో కాంస్యం పతకాలు సాధించారని తెలిపారు. వీరితో పాటు ఎం.హేమలత, టి.కస్తూరి, ఎం.లక్ష్మీపావని, వినోదిని, ఏ.అశ్విని, బి.అలేఖ్య, పి.హేమలత, కె.అనూష, సి.హెచ్. దుర్గాభవాని, భవ్యజ్యోతి, గోపీనాథ్, యెహూవా శివ వివిధ అంశాలలో పతకాలు సాధించారని వివరించారు. విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్ట్

రూ.3.50లక్షల విలువైన రాగి తీగను స్వాధీనం చేస్తున్నకున్న పోలీసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కె.నాగేశ్వరరావు

వినుకొండ(నూజెండ్ల): పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేస్తున్న దొంగలను అరెస్ట్ చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బంది సాయంతో దొంగలను పట్టుకున్నామన్నారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం అసనపాలెంకు చెందిన నల్లబోతుల పెద్ద యంగయ్య, పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన బత్తుల కోటయ్య, తురిమెల్ల గ్రామానికి చెందిన తోలుసురి లక్ష్మీనారాయణ, వినుకొండ మండలం గాంధీనగర్‌కు చెందిన వీరబోయిన బాలయ్య ఏడాదిగా పల్నాడు జిల్లా, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ దొంగతనాలకు పాల్పడుతూ తక్కువ రేటుకు ఇనుప కొట్లల్లో అమ్ముకుంటున్నారు. వీరు ఐనవోలు పోలీస్ స్టేషన్ పరిధిలోనే కాకుండా పల్నాడు జిల్లాలోని శావల్యాపురం, బండ్లమోటు, వినుకొండ, నకరికల్లు, మాచర్ల టౌన్, రొంపిచర్ల, ప్రకాశం జిల్లాలోని దొనకొండ, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పెద్దారవీడు, దర్శి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు మొత్తం 27 కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.3.50లక్షల విలువైన 350 కేజీల కాపర్‌వైర్‌ను స్వాధీనపరచుకున్నట్లు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్, ఐనవోలు ఎస్‌ఐ బీవీ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డుకు 57,488 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 57,488 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 51,264 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,799 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.ఆంజనేయులు తెలిపారు.

జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలకు సువర్ణ ఎంపిక



నూతక్కి(మంగళగిరి): భువనేశ్వర్‌లో ఈ నెల 18నుంచి 20 వరకు జరగనున్న జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలకు నగర పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ స్కూలు విద్యార్థిని నూతక్కి సువర్ణ ఎంపికైంది. గత నెల 27,28వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా కెప్టెన్‌గా అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు సోమవారం పీడీ కె. రజనీనాయక్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని సువర్ణను హెచ్‌ఎం రాజీవ్ రత్న, ఉపాధ్యాయులు అభినందించినట్లు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



భట్టిప్రోలులో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ స్టాల్‌లో జరుగుతున్న విక్రయాలు

భట్టిప్రోలు: పూర్వం సేంద్రియ ఎరువులతోనే వ్యవసాయం అధిక దిగుబడులు సాధించే వారని అటువంటి వ్యవసాయం నేడు రసాయనికంగా మారిపోయిందని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ నీలం ప్రకాష్ కుమార్ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు ప్రతి సోమవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో విక్రయాలు నిర్వహిస్తున్నారు. ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ మనిషి సుఖం ఎక్కువ కోరుకోవడం వల్ల అనారోగ్యాలు కూడా వెన్నాడుతాయని ఈ నేపథ్యంలో రైతులు సేంద్రియ పద్ధతులతో పండించిన పంటల దిగుబడులను మార్కెట్‌లో ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేసి విక్రయించడం ద్వారా రైతులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రైతులు ఏ పంట సాగుచేసిన రసాయన ఎరువులు, పురుగుమందులపై ఆధారపడటమే కాక అధికంగా డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుందని అన్నారు. పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని అన్నారు. స్టాల్ ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. స్టాల్‌లో కూరగాయలు, ఆకుకూరలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పురుగు మందు రహిత కూరగాయలను మాత్రమే ఈ స్టాల్‌లో విక్రయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, ఐసీఆర్పీలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు రైతులకు న్యాయం చేయకపోతే ధర్నా



మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల శుభం కోల్డ్ స్టోరేజ్‌లో పసుపు పంటను భద్రపరచి నష్టపోయిన రైతులకు యాజమాన్యం జనవరి 19వ తేదీలోపు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా రైతు సంఘం నాయకులు జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజ్ వద్ద పసుపు రైతులతో కలసి సోమవారం కలిసి ఆయన మాట్లాడారు. అగ్నిప్రమాదం జరిగి 11 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు నష్టపోయిన రైతులకు పరిహారం అందించలేదని తెలిపారు. లక్షా ఆరు వేల బస్తాలను 300 మందికి పైగా రైతులు గోడౌన్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. అగ్ని ప్రమాదానికి గురై అంతా నష్టపోయారన్నారు. ఇప్పటి వరకు యాజమాన్యం గానీ బీమా కంపెనీ వాళ్లు నష్టపరిహారం చెల్లించలేదని తెలిపారు. రైతులకు, కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యానికి కుదిరిన ఒప్పందం ప్రకారం 2025 జనవరి 19వ తేదీలోపు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలసి పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

అవయవదానంతో మరణించినా జీవితం

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ



అవయవ దానం ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: అవయవదానంతో మనిషి చనిపోయినా వేరొకరి శరీరంలో జీవించవచ్చని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్, అఖిల భారత శరీర అవయవదాతల సంఘం నాయకులు డాక్టర్ యశస్వి రమణ అన్నారు. గుంటూరు జీజీహెచ్‌లోని శుశ్రుత హాలులో సోమవారం అవయవదానంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యశస్వి రమణ మాట్లాడుతూ చాలా మంది మరణించిన అనంతరం కుటుంబ సభ్యులు వారి శరీరాలను కాల్చివేయడం, పూడ్చి వేయడం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎంతో మంది దేశ వ్యాప్తంగా తీవ్ర వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రుల్లో శరీర అవయవాల కోసం పడిగాపులు కాస్తున్నట్లు వెల్లడించారు. మూఢ నమ్మకాలతో చనిపోయిన వారిని కాల్చడం, పూడ్చడం చేయకుండా వారి శరీర అవయవాలను దానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని తెలిపారు. బ్రెయిన్ డెడ్ అయినప్పుడు మాత్రమే చనిపోయిన వారి నుంచి అవయవాలు సేకరిస్తారని, మరణించిన వారి నేత్రాలను సేకరించి అంధులకు చూపు ఇవ్వవచ్చని చెప్పారు. కిడ్నీ, లివర్, హార్ట్, ఇతర శరీర అవయవాలను దానం చేయడం ద్వారా ఆసుపత్రుల్లో తీవ్ర అస్వస్థత ఉన్నవారికి నూతన జీవితాన్ని ప్రసాదించవచ్చని తెలిపారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలని ఆయన చెప్పారు. వైద్య సిబ్బందితో అవయవదాన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నర్సుల సంఘం నేతలు పద్మజ, హేమలత, ఆషాలత, సునీత, నర్సింగ్ అధికారులు గంగ, విజయ, కిరణ్మయి, నాంచారమ్మ, రమాదేవి, జయలలిత, పద్మ, పలువురు నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలి అర్బన్: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తెనాలి డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. తెనాలి డివిజన్ స్థాయి సలహా సంఘ సమావేశాన్ని పాత ప్రభుత్వ వైద్యశాలలోని డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతదేశంలో ఆడ భ్రూణ హత్యలను ఆపడానికి ప్రభుత్వం 1994లో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టాన్ని రూపొందించిందని తెలిపారు. దాని ప్రకారం గర్భం దాల్చిన తరువాత లింగ ఎంపికను ఎవరికీ తెలియజేయకూడదని సూచించారు. గర్భంలో ఆడపిల్ల ఉందని తెలియగానే అనేక మంది భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆమె సూచించారు. స్కానింగ్ సెంటర్లలో రిజిస్ట్రేషన్ పత్రాలు, స్కానింగ్ ధరల వివరాలు, లింగనిర్ధారణ జరపబోమని వెల్లడించే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యశాల వైద్యులు డాక్టర్ మానస, డాక్టర్ సురేష్, డాక్టర్ వినీల్, సీనియర్ ఏపీపీ సునీల్‌కుమార్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు భానుమతి, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం



ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాల: పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మ తిరునాళ్ల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. తొలి రోజు సీనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో నంద్యాల జిల్లా పెదకొట్యాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణ రాష్ట్రం హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి, సాకేత్ రెడ్డి,సారికారెడ్డి ఎడ్ల జత 3,439.6 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని, కృష్ణా జిల్లా పెనుమలూరుకు చెందిన గరికిపాటి శ్రీధర్ ఎడ్ల జత 3,200 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని, నాగర్ కర్నూల్ తాడూరు, యాదిరెడ్డి పల్లికు చెందిన డాక్టర్ అకిలేష్‌రెడ్డి ఎడ్ల జత 3,090.3 అడుగుల దూరం లాగి మూడో బహుమతిని, దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 3,045.2 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని, గుంటూరు జిల్లా తాడేపల్లి కుంచనపల్లికి చెందిన పులగం జశ్వత్‌రెడ్డి ఎడ్ల జత 2,800 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని, సిరిమెళ్ల సంపుమాందిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత 2,628 అడుగులు దూరం లాగి ఆరో బహుమతిని, గురజాల మండలం పులిపాడుకు చెందిన పెద్దినేని అమరనాగేశ్వరరావు ఎడ్ల జత 2,600 అడుగుల దూరం లాగి ఏడో బహుమతిని, కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్ల జత 2,246.2 అడుగుల దూరం లాగి 8వ బహుమతిని, నల్గొండ జిల్లా కోప్పోలు కు చెందిన ఐతరాజు సత్యనారాయణ ఎడ్ల జత 1,826 అడుగుల దూరం లాగి 9వ బహుమతిని కైవసం చేసుకున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

పిట్టంబండ మేజరు కాల్వలో యువకుడి మృతదేహం

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామ సమీపంలో పిట్టంబండ ఎన్‌ఎస్పీ కాలువలో యువకుడి మృతదేహం గుర్తించినట్లు ఎస్‌ఐ లేళ్ళ లోకేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినుకొండ పట్టణం శివారు నాగిరెడ్డిపల్లికు చెందిన దాసరి వంశీ (21) ఐటీఐ చదువుకొని ప్రస్తుతం వినుకొండ హెచ్‌పీ గ్యాస్‌లో డెలివరి బాయ్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామస్తుల సమాచారం, వీఆర్వో పిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించామని పేర్కొన్నారు.

రామాంజనేయపురంలో పాఠశాల ప్రారంభించండి



గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన పాఠశాల భవనం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భవనం నిర్మాణం
- ఉపాధ్యాయ నియామకాలకు ప్రస్తుతం మీనమేషాలు
- విద్యార్థులు బడికి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది
- డీఈఓకు వినతి పత్రం అందించిన ఏపీటీఎఫ్ నేతలు



డీఈఓ చంద్రకళకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం శ్రీరామాంజనేయపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దాదాపు 40 ఏళ్ల క్రితం 1985లోనే రామాంజనేయపురం గ్రామం ఏర్పడినా ఇప్పటివరకు పాఠశాలను ఏర్పాటు చేయకపోవటం శోచనీయమన్నారు. ఇదే అంశాన్ని తమ యూనియన్ పల్నాడు జిల్లా శాఖ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకరావటంతో బెల్లంకొండ ఏపీటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్ కిరణ్, దుర్గారావు తదితరులతో కలసి స్వయంగా గ్రామంలో పర్యటించి అక్కడి స్థితిగతులను తెలుసుకొన్నట్టు వివరించారు. గ్రామంలో 200 వరకు గృహాలు ఉన్నాయని, దాదాపు వందమందికి పైగా బడిఈడు పిల్లలు ఉన్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. గ్రామంలోని పిల్లలు చదువుకోవాలంటే ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న మన్నెసుల్తాన్‌పాలెం గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పాఠశాలకు పక్కా భవనం నిర్మించినా డైస్ కోడ్ కేటాయించక పోవటంతో ఉపాధ్యాయుల నియామకం చేపట్టలేదని వివరించారు. విద్యాశాఖాధికారులు వెంటనే స్పందించి శ్రీరామాంజనేయపురంలో పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్, కరిముల్లా, ఆడిట్ కమిటీ కన్వీనర్ బొర్రా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.